క్లుప్తంగా

ప్రింటర్ల బహూకరణ

కురుమద్దాలి(మొవ్వ): కురుమద్దాలి సచివాలయానికి రూ.30 వేల విలువైన రెండు ప్రింటర్లను దాతలు స్థానిక డీసీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. పుట్టగుంట రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు పుట్టగుంట హర్షవర్ధన్ ప్రసాదు సహకారంతో ప్రింటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.విజయ భారతి, స్థానికులు పి.గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీ వైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థానములలో 9 హుండీలను మంగళవారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 89 రోజులకు గాను నోట్ల ద్వారా రూ.5.54 లక్షలు, చిల్లర నాణేల ద్వారా రూ.52,241 కలిపి మొత్తం రూ.6.07 లక్షలు వచ్చినట్లు ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయశాఖ గన్నవరం తనిఖీదారు అనేరాధ పర్యవేక్షించారు.

వాటర్ కూలర్ వితరణ



పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానమునకు ఇండియన్ బ్యాంక్ ఉయ్యూరు శాఖ ఆధ్వర్యంలో వాటర్ కూలర్ బహూకరించారు. ఆలయంలో మంగళవారం వాటర్‌కూలర్‌ను ఈఓ సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావుకు బ్యాంకు సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామమోహనరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పమిడిముక్కల: ప్రతి ఒక్క రైతు రైతు సేవా కేంద్రాల్లో ఏ పంట వేశారో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని గన్నవరం ఏడీఏ సునీల్ పేర్కొన్నారు. గురజాడ పీఏసీఎస్‌లో ఎరువుల బిల్లులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి వరిపొలాలను సందర్శించి సూచనలు, సలహాలు అందజేశారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వరిపైరుకు స్ప్రే రూపంలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ గణేష్‌రెడ్డి, ఏఈఓ గవాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ కొండేటి సత్యన్నారాయణ, వీఏఏలు సుజాత, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



మొవ్వ: మండలంలోని కూచిపూడి, పెదపూడిలలో నాలుగు ఎరువుల దుకాణాలలో మంగళవారం అధికారుల పర్యవేక్షణలో యూరియా విక్రయాలు నిర్వహించారు. సరఫరా అయిన 32 టన్నులను ఆయా దుకాణాల్లో మొవ్వ ఏడీఏ సూరపనేని శ్యామల పర్యవేక్షణలో మండల టాస్క్ ఫోర్స్ బృందం తహసీల్దార్ కె.మస్తాన్, కూచిపూడి ఎస్సై కేఎస్ విశ్వనాథ్, ఎంఏఓ బి.సురేష్ బాబు నాయక్‌ల పర్యవేక్షణలో విక్రయాలు జరిపారు. యూరియా పొందాలంటే పాస్ బుక్కు నకలు, ఆధార్ కార్డులు తెచ్చుకుంటేనే ఇస్తాం అని షరతులు పెట్టటంతో రైతుల్లో గందర గోళ పరిస్థితి ఏర్పడింది. మొవ్వ మండలంలోని గ్రామాల నుంచే కాకుండా పమిడిముక్కల, పామర్రు మండలాల నుంచి రైతులు ఎరువుల దుకాణాల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. యూరియా కోసం ఇలా గతంలో ఎన్నడూ ఇబ్బందులు పడలేదని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సర్వత్రా వినాయక చవితి సందడి



అమ్మకానికి సిద్ధం చేసిన మట్టి వినాయక విగ్రహాలు



మార్కెట్ సెంటర్‌లో సామగ్రి దుకాణాల వద్ద భక్తులు



మొవ్వలో మట్టి విగ్రహాలతో విద్యార్థులు

- గ్రామాల్లో మొదలైన వినాయక చవితి సందడి
- ప్రజలతో కిటకిటలాడుతున్న మార్కెట్ సెంటర్
- పట్టణ వీధుల్లో పూజాసామగ్రి విక్రయాల వద్ద భక్తుల రద్దీ

గుడివాడరూరల్: పట్టణంలో చవితి సందడి మొదలైంది. నాగవరప్పాడు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భక్తులతో రహదారులు కోలాహలంగా మారాయి. నాగవరప్పాడులో వివిధ ప్రాంతాల్లో తయారు చేసిన విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు కొనుగోలు చేసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పట్టణానికి రావడంతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపారు.

పూజా సామగ్రి విక్రయాలు

నెహ్రూచౌక్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు పూజా సామగ్రి అమ్మకాల సందడి నెలకొంది. పూజా సామగ్రికి ఉపయోగించే అన్ని రకాల వస్తువులను అమ్మకానికి పెట్టడంతో సామగ్రిని కొనుగోలు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. భక్తుల రాకతో మార్కెట్‌సెంటర్ కిక్కిరిసింది. పూజకు ఉపయోగించే పత్రిని భక్తులు కొనుగోలు చేశారు. చిన్నచిన్న వినాయకుని మట్టి విగ్రహాలను అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కొనుగోలు చేశారు. రద్దీ ప్రాంతాల్లో గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పమిడిముక్కల: మండల గ్రామాల్లో వినాయచవితి సందడి మొదలైంది. పందిళ్లు వేసి అలంకరణలు చేశారు. బుధవారం వినాయక విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంటాడ, వీరంకిలాకు, కృష్ణాపురం సెంటర్‌లో పత్రి, పూలు, పండ్ల దుకాణాలు ఏర్పాటు చేశారు. మండలంలో 62 విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తులు అందాయని ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

గుడ్లవల్లేరు మండలంలో..

గుడ్లవల్లేరు: వినాయక చవితి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్ మంగళవారం సాయంత్రం జనంతో కిటకిటలాడింది. చవితి పూజకు కావాల్సిన పత్రి, పూలు, పండ్లు కొనుగోలు చేసేందుకు భక్తులు పోటీ పడ్డారు. మట్టి వినాయక విగ్రహాల్ని కొనుగోలు చేసేందుకే భక్తులు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చారు.

కూచిపూడి(మొవ్వ): ఒకవైపు వినాయకుని పూజకు వినియోగించే వివిధ రకాలపత్రి, వివిధ రకాల పండ్లు, ఇంకొక వైపు మట్టి వినాయకులు, పూజకు వినియోగించే పూల దుకాణాలతో కూచిపూడి సెంటర్ కళకళలాడింది. వినాయక చవితి వేడుకలకు గ్రామాలలో కూడా పట్టణాల మాదిరిగా పత్రివిక్రయాల షాపులు అధిక సంఖ్యలో వెలిశాయి. మండలంలోని మొవ్వ, నిడుమోలు, కాజ, కోసూరు లాంటి ప్రధాన సెంటర్ల్ లే కాకుండా మారుమూల గ్రామాల్లో కూడా విక్రయాలు కొనసాగాయి.

మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలు తయారుచేసి కళాశాల చుట్టుపక్కల భక్తులకు ఉచితంగా అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.ఆర్.మంజుల, డాక్టర్ ఎం.అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి మండలంలో..

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో పందిళ్లు వేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఆయా ఆలయాల వద్ద, మండపాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటుంది. కానుకొల్లు గ్రామంలో 11 రోజులు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం వెన్నార్ సిరామిక్స్ లిమిటెడ్ కంపెనీ సమకూర్చిన 500 మట్టి వినాయక విగ్రహాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ రమేష్, జీఎం అమర్నాథ్, హెచ్‌ఆర్ ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కై కలూరు: వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో టేకి జయచారి ఆర్థికసాయంతో మట్టి వినాయకుని విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. కైకలూరు కామాక్షి పట్టణ స్వర్ణకార, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల చైర్మన్ టేకి వెంకట సత్యనారాయణ, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల పంపిణీ

ముదినేపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణకు స్థానిక జెడ్పీహైస్కూల్ విద్యార్థులు వినూత్న కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. పలురకాల ఆకారాలతో గణనాథుడి ప్రతిమలు తయారుచేసి ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వై.విజయకుమార్ మాట్లాడుతూ పర్యావరణంపై విద్యార్థులతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ప్రోత్సాహంతోనే విజయాలు సాధ్యం

గుడ్లవల్లేరు: స్థానిక వి.వి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీ యాజమాన్యం ప్రోత్సాహంతోనే తమ విద్యార్థులు, అధ్యాపకులు పలు విజయాలను సాధించేందుకు దోహదపడుతున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు అన్నారు. గుంటూరులోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన అంతర్జాతీయ వర్క్ షాప్ నెక్స్ట్ జెన్ బయో కనెక్ట్ –2025లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.లావణ్య, బీఫార్మసీ 4వ సంవత్సర విద్యార్థిని ఎస్.త్రివేణి విజయం సాధించారని మంగళవారం విలేకరులకు ఆయన తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో లావణ్య ఆల్వారిన్ అనే ఔషధ మోతాదుని కనిపెట్టే పద్ధతులపై ఈ పోస్టర్‌ను ప్రదర్శించి రెండవ బహుమతిని గెలుచు కుందన్నారు. ఎస్.త్రివేణి ఈ పోస్టర్‌ను ప్రదర్శించి రెండవ స్థానంలో నిలిచిందన్నారు. వీరికి మోమెంటో, ప్రశంసా పత్రం, నగదు బహుమతిని అందించారని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ షేక్ అమీనాభి, డాక్టర్ పి. రవి, డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ టి.బాలకృష్ణ, బి.సత్యశ్రీ తదితరులు అభినందించారు.



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు

దొండపాడు కాల్వ వద్ద నిమజ్జనం నిషేధం

గుడివాడరూరల్: దొండపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్న కాల్వలో లోతు ఎక్కువగా ఉండి ప్రమాదకరంగా మారినందున విగ్రహాల నిమజ్జనం నిషేధించామని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ దొండపాడు కాల్వలో గతంలో నిమజ్జనం చేసే సమయంలో చాలా ప్రమాదాలు జరిగాయన్నారు. దీనిపై భక్తులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో విగ్రహాల నిమజ్జనం చేయకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ట్రైనీ ఎస్‌ఐ పి.లోకేశ్వరి, పోలీసులు, ఆ ప్రాంత వాసులు పాల్గొన్నారు.



నిమజ్జనం నిషేధమనే బ్యానర్ వద్ద ఎస్‌ఐ చంటిబాబు

ఉత్సవాల నిర్వాహకులతో సమీక్ష

ముదినేపల్లి రూరల్: వినాయకచవితి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్, తహసీల్దార్ లతీఫ్‌బాషా నిర్వాహకులకు సూచించారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఊరేగింపులు, నిమజ్జనాలు జరిగే సమయాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్సై వీరభద్రరావు మాట్లాడుతూ నిర్వాహకులు అశ్లీల నృత్య ప్రదర్శనలు, డీజే బాక్సుల వినియోగించొద్దన్నారు. ప్రతిరోజూ రాత్రి సమయాల్లో చవితి పందిళ్లవద్ద పోలీసుల గస్తీ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ అశోక్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం– చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. నిత్యాన్నదాన ప్రసాదానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డైనింగ్‌షెడ్ నిర్మాణానికి భూమి పూజ

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో డైనింగ్ షెడ్ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు షెడ్డు నిర్మాణానికి స్థానిక 'ఎ లిటిల్ ఫ్లవర్ ద లీడర్' విద్యాసంస్థల అధినేత బొర్రా చలమయ్య ఆర్థికసాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు.

మదర్‌థెరిస్సా సేవలు చిరస్మరణీయం

కైకలూరు: మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా కోరుకొల్లు రోడ్ సెంటర్‌లో ఆమె విగ్రహానికి మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో కైకలూరు పంచాయతీ తాత్కాలిక సర్పంచ్ కేపీఎస్ఎం.నాయుడు, వార్డు సభ్యులు సమతం శీను, బెల్లాని శ్యామలరావు, మేడూరి నాంచారయ్య, గాలిబ్‌బాబు, గ్రామస్తుడు గుడిపాటి జగన్నాథం పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్ వద్ద థెరిస్సా విగ్రహానికి నివాళి అర్పించారు. వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయ శంకర్, సభ్యులు కారి శరత్ బాబు, వేణు, బి.లక్ష్మణరావు, వినోద్ పాల్గొన్నారు.

ఎరువుల నిల్వల తనిఖీ

పెదపారుపూడి: పెదపారుపూడి, వానపాముల పీఏసీఎస్‌లలో ఎరువుల నిల్వలను తహసీల్దార్ బి.శ్రీనునాయక్ మంగళవారం తనిఖీ చేశారు.యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయి, ఎంత మంది రైతులకు ఇచ్చారో తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలన చేశారు. ఎంఏఓ త్రినాథ ఆంజనేయరావు, పీఏసీఎస్ కార్యదర్శులు నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

ముదినేపల్లి రూరల్: కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయు జిల్లా సహాయక కార్యదర్శి ఎం.నాగమణి అన్నారు. ముదినేపల్లిలో సీఐటీయూ మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. మండల నూతన కమిటీ కన్వీనర్‌గా పద్మ కోకన్వీనర్లుగా విజయలక్ష్మీ, అరుణ, నాగబాబును ఎంపిక చేశారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మహంకాళరావు, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యుడు చిన్నం మాధవ, విజయలక్ష్మీ, రిబ్కా, నిరోషి పాల్గొన్నారు.

విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరణ

మచిలీపట్నంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల ప్రారంభించిన విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య (ఫ్యాప్టో) కృష్ణాజిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఫ్యాప్టో నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె. రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అల్పాహారం లేకుండా ఉండాల్సి రావడం, పాఠశాలల్లో పేనల్స్‌కు ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడం, ప్రతి తరగతిలో ఉపాధ్యాయులు తమ సొంత సెల్‌ఫోన్లతో కార్యక్రమం నిర్వహించాల్సి రావడం వంటి సమస్యలను ఫ్యాప్టో నాయకులు వివరించారు. కార్యక్రమంలో కనకారావు, హుస్సేన్, సూరిబాబు, శేషగిరి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

గుడ్లవల్లేరు: స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ ఆదేశించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆయన పలు అంశాలపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో మంచినీటి పైపులైన్ల లీకేజీలు అరికట్టాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.

మట్టి ప్రతిమలను పూజిద్దాం



గుడివాడరూరల్: ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి విగ్రహాలు అందజేయడం అభినందనీయమన్నారు. లయన్స్ అధ్యక్షుడు వేణుగోపాలరావు, ఆర్సీ కిషోర్, జెడ్సీ సతీష్, సెక్రటరీ పి.సతీష్, ట్రెజరర్ కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పొట్లూరి వెంకటేశ్వరరావు, లయన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.